సాక్షి నిర్మల్

బుధవారం ၊ 12 ၊ జూలై ၊ 2023



పసిడి సాగు పతనం

పసుపు సాగును పసిడితో పోలుస్తారు. అయితే ఏళ్లుగా పసుపు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు సాగును తగ్గిస్తున్నారు. 8లో▸

ప్రజల కోసం పనిచేయాలి

కుంటాల: ప్రజల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు పని చేయాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. కుంటాల పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రతీరోజు గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్సై హన్మాండ్లు ఉన్నారు.

గరిష్టం/కనిష్టం
30.3/24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడన ద్రోణి ప్రభావంతో మధ్యాహ్నం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బస్సు సీజ్



సీజ్ చేసిన ప్రైవేట్ బస్సు

నిర్మల్‌టౌన్: పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ప్రైవేటు బస్సును ఏఎంవీఐ హరీంద్రకుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని 44 జాతీయ రహదారిపై మంగళవారం తనిఖీలు చేపట్టారు. బెంగళూరు నుంచి ఉత్తరప్రదేశ్ కు అధిక ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును గంజాల్ టోల్‌ప్లాజా వద్ద సీజ్ చేశారు. బస్సులో 61 మంది ప్రయాణిస్తున్నట్టు తెలిపారు. సీజ్ చేసిన బస్సును బస్ డిపోకు తరలించినట్టు పేర్కొన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఏఎంవీఐ పేర్కొన్నారు.

బాసరలో కలెక్టర్ పర్యటన..



డ్రైనేజీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసా: బాసరలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి మంగళవారం పర్యటించారు. పంచాయతీ పరిధిలోని పలు వార్డులకు వెళ్లారు. డ్రైనేజీలు, నిర్వాహణ, ప్రధాన రోడ్ల పరిస్థితిని చూశారు. వర్షాలు కురిసిన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. బాసర గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రత పాటించాలి



గోబర్ గ్యాస్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో స్రవంతి

కడెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీవో స్రవంతి అన్నారు. మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసిన గోబర్ గ్యాస్ యూనిట్‌ను మంగళవారం పరిశీలించారు. అనంతరం మాసాయిపేట్, ఎలగడప గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ పనులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఎంపీవో ఉపేందర్ సర్పంచులు గంగన్న, రాముగౌడ్, సత్తవ్వ ఏపీవో జయదేవ్ తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పైర్‌పై నేడు ఓరియంటేషన్

నిర్మల్ రూరల్:ఇన్‌స్పైర్ కార్యక్రమంపై హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు జూమ్ విధానంలో బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం ఉంటుందని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో రాష్ట్రస్థాయి సైన్స్ అధికారులు, పల్లె సృజన ఫౌండేషన్ అధికారులు పాల్గొంటారని వివరించారు. సైన్స్ ప్రాజెక్టుల తయారీలో వివిధ రకాల మెలకువలు తెలియజేస్తారని పేర్కొన్నారు. జిల్లా నుంచి ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు నమోదు కావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఇప్పటికే జూమ్ లింకును పాఠశాలల గ్రూపులో చేరవేశామన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు వచ్చేలా చూడాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్, సోషల్, గణితం ఉపాధ్యాయులు తప్పకుండా పాల్గొనాలని సూచించారు.

'ఉమ్మడి జిల్లా రైతులు ఉద్యమించాలి'

నిర్మల్‌టౌన్: వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ సరఫరాపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఉమ్మడి జిల్లా రైతులు ఉద్యమించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ రైతులకు కొండంత అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటుంటే, కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతుల పొట్టగొట్టాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ రైతు వ్యతిరేక ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా బుధవారం నిరసనలు చేపట్టాలని సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ దిష్టిబొమ్మలు దహనం చేయాలని సూచించారు.



మక్క చేనులో దౌర కొడుతున్న రైతు

ప్రాణం పోసిన ముసురు

- పత్తి, సోయా, మక్క పంటలకు ఊరట
- భారీ వర్షాలు కురిస్తేనే వరి నార్లు
- ఫలించిన రైతుల పూజలు



నిర్మల్‌లో కురుస్తున్న వర్షం

భైంసా: వాడిపోతున్న మొక్కలకు మంగళవారం దినమంతా కురిసిన ముసురు వాన ప్రాణంపోసింది. నేలవైపు చూసిన మొక్కలు వర్షపు చినుకులకు నిగనిగలాడుతున్నాయి. ఇంతకాలం వానల కోసం వేచిచూసిన రైతులు అదునుదాటిపోతుండడంతో వరుణుడిపై భారంవేసి నేలతల్లిని నమ్ముకుని ఈనెల మొదటివారంలోనే విత్తనాలువేశారు. జూన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. జూలై మొదటి వారంలో రెండు, మూడు రోజులు కురిసిన వర్షానికి జిల్లా రైతులు సోయా, పత్తి, మొక్కజొన్న విత్తనాలు వేశారు. మొలకలు వచ్చినా వర్షాలు లేకపోవడంతో మాడు ముఖం వేశాయి. ఈ క్రమంలో మంగళవారం ముసురుకున్న వాన మొక్కలకు ప్రాణంపోసింది.

పొడిదుక్కుల్లోనే విత్తనాలు..

జూన్ చివరి వరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు పొడి దుక్కుల్లోనే పత్తి, సోయా, మొక్కజొన్న విత్తారు. ఈ క్రమంలో అడపదడపా కురిసిన జల్లులకు విత్తనాలు మొలకలు వచ్చాయి. ఈ క్రమంలో వారం రోజులుగా వరుణుడు మళ్లీ ముఖం చాటేశాడు. దీంతో మొక్కలు మాడుముఖం వేశాయి. రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూశారు. వానల కోసం పూజలు చేశారు. రైతుల పూజలు ఫలించి మంగళవారం దినమంతా వాన ముసురుకుంది. మొక్కలకు ప్రాణంపోసింది.

రోజూ పూజలు...

జిల్లావ్యాప్తంగా వర్షాల కోసం రైతులు రోజూ పూజలు చేస్తున్నారు. రుతుపవనాలు ప్రవేశించి నెల దాటినా పెద్ద వానలు లేకపోవడంతో ఊరూరా గ్రామ దేవతలకు సామూహిక బోనాలు సమర్పించి వర్షాలు కురవాలని పూజించారు. గంగనీళ్లు తెచ్చి గ్రామ దేవతలకు అభిషేకాలు చేస్తున్నారు. భైంసా మండలం దేగాంలో మూడు రోజులుగా గంగనీళ్లతో అభిషేకాలు చేస్తున్నారు. బాసరలో అర్ధరాత్రి మహిళలంతా ఇళ్లముందు ముగ్గువేసి వరుణ దేవుడికి బిందె పూజలు చేస్తున్నారు. అయినా ఇప్పటి వరకు పెద్ద వర్షం మాత్రం కురవలేదు.

42 వేల ఎకరాల్లో సోయా.. 40 వేల ఎకరాల్లో పత్తి..

జిల్లా వ్యాప్తంగా ఈ వానాకాలం 42వేల ఎకరాల్లో సోయా పంట సాగైంది. ట్రాక్టర్లతో సోయా విత్తనాలు వేశారు. వారం రోజులుగా వర్షాలు లేక సోయా మొలకలు కనిపించలేదు. రెండు రోజులుగా కురుస్తున్న చిరు జల్లులకు మొలకలు వస్తున్నాయి. ఇక పత్తి పంట జిల్లా వ్యాప్తంగా సుమారు 40 వేల ఎకరాల్లో సాగుచేశారు. ఇప్పటికే అక్కడక్కడ మొలకలు వచ్చాయి. వానలు లేకపోవడంతో మొలకలు వాడిపోయే పరిస్థితి నెలకొంది. ఈక్రమంలో కురుస్తున్న ముసురు వాన పంటలకు ప్రాణం పోసింది.

భారీ వర్షాలు కురిస్తేనే నార్లు..

రుతుపవనాల రాకతో వాతావరణం మారినా ఆశించిన వర్షాలు మాత్రం కురువలేదు. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా భారీ వర్షం నమోదు కాలేదు. చిరు జల్లులు కురిసి ఆగిపోతుంది. దీంతో వానాకాలం పంటలసాగు మరింత ఆలస్యమవుతుంది. రెండేళ్లుగా మిరుగు ప్రారంభంకాగానే భారీ వర్షాలు కురిశాయి. గతేడాది భారీ వర్షాలతో జిల్లాలో ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, వాగులు, ఒర్రెలు నిండుగా కనిపించాయి. చుట్టూ జలం ఉండడంతో బోర్లు ఎత్తిపోశాయి. ఈయేడాది ఏ చెరువుల్లోనూ అంతగా నీరు చేరలేదు. దీంతో ఇప్పటి వరకు నార్లు పోయలేదు. భారీ వర్షాలు కురిస్తేనే వరినార్లు పోస్తామని రైతులు పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ ఘర్ వాపసీ!



మంత్రి కేటీఆర్‌తో అప్పాల గణేశ్ చక్రవర్తి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్ తదితరులు

- వీడినవారే మళ్లీ కారెక్కుతున్నరు
- కేటీఆర్‌తో నిర్మల్ లీడర్ల భేటీ
- సయోధ్యతోనే పనిచేస్తామన్న నేతలు
- నేడు పార్టీలోకి 'అప్పాల' వర్గం

నిర్మల్:ఒకవైపు బీజేపీ హవా, మరోవైపు పుంజుకుంటున్న కాంగ్రెస్.. ఈ రెండింటినీ ఎదుర్కొంటూ వచ్చే ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా 'కారు' మలుపులు తీసుకుంటోంది. గతంలో పార్టీని కాదని వెళ్లిన కీలక నేతలను తిరిగి కారెక్కిస్తోంది. జిల్లాలో ప్రధానమైన నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ చేరికల పర్వం విజయవంతంగా ప్రారంభించింది. మున్సిపల్ మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పాల గణేశ్‌చక్రవర్తిని పార్టీలోకి రప్పిస్తోంది. ఈమేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మల్ నేతలంతా హైదరాబాద్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్‌ను మంగళవారం కలిశారు. రానున్న ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి, గెలుద్దామని పిలుపునిచ్చారు. గతంలో జరిగినవన్నీ మర్చిపోయి సయోధ్యతో పనిచేసి, పార్టీని గెలిపించుకుంటామని నేతలు కేటీర్‌కు హామీ ఇచ్చారు. ఇందులో ఎమ్మెల్సీ దండె విఠల్, సీనియర్‌నేత లోక భూమారెడ్డి, మున్సిపల్, గ్రంథాలయసంస్థ, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్లు గండ్రత్ ఈశ్వర్, ఎర్రవోతు రాజేందర్, ధర్మాజీ రాజేందర్, నాయకులు అల్లోల గౌతంరెడ్డి, రాంకిషన్‌రెడ్డి, మారుగొండ రాము, నేరెళ్ల వేణు, అప్పాల ప్రభాకర్, కత్తి నరేందర్, సైండ్ల శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు, అప్పాల వర్గీయులు పాల్గొన్నారు.

గెలవాలంటే..

రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ జిల్లాలోనూ బలంగానే ఉంది. క్షేత్రస్థాయి నుంచి పటిష్టమైన కార్యకర్తలు, నాయకులు ఉన్నారు. కానీ.. ఎక్కడా లేని విధంగా జిల్లాలో బీజేపీ కారు పార్టీని కలవరపెడుతోంది. కర్ణాటక ఎన్నికల తర్వాత కూడా గ్రామీణ ప్రాంతాల్లోనూ యువత కొంతమేరకు ఆ పార్టీవైపు మొగ్గుచూపడం గులాబీ పార్టీని ఇబ్బంది పెడుతోంది. మరోవైపు కర్ణాటక ఎన్నికల తర్వాత కాంగ్రెస్ క్రమంగా బలపడుతున్నట్లు కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో రానున్న ఎన్నికల్లో గెలవాలంటే పార్టీని పటిష్టం చేయాలని, బీఆర్ఎస్‌లోకి కీలకమైన నేతలను తీసుకోవాలని మంత్రి కేటీఆర్ తరచూ చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే జిల్లాలో నేతల చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలో బలమైన మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన మంత్రి ఐకేరెడ్డి మాజీ అనుచరుడు, నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తిని మళ్లీ కారెక్కించడంలో సఫలీకృతమయ్యారు. ఎమ్మెల్సీ దండె విఠల్ రాయబారంతో అప్పాలవర్గం మళ్లీ గులాబీ కండువా వేసుకునేందుకు సిద్ధమయ్యారు.

మళ్లీ కలిసి పనిచేయాలని..

మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, అప్పాల గణేశ్‌చక్రవర్తి గతంలో కలిసి పనిచేసి ఇద్దరూ విజయాలు అందుకున్నారు. 2018 ఎన్నికలకు కొద్దిరోజుల ముందు అప్పుడు చైర్మన్‌గా, పార్టీలో కీలకంగా ఉన్న గణేశ్‌చక్రవర్తి ఏకంగా 12 మంది కౌన్సిలర్లు, నాయకులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి ఎన్నికల్లో బీఆర్ఎస్ మెజార్టీ భారీగా తగ్గడానికి కారణమయ్యారు. మరోవైపు ఇటీవల జిల్లాకేంద్రంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాల్లో నాయకత్వలోపం కనిపించడంతో మంత్రి వ్యూహం మార్చారు. పార్టీని బలోపేతం చేస్తూ తన గెలుపును పక్కా చేసుకునేందుకు గణేశ్‌వంటి కీలక నేతలపై దృష్టిపెట్టారు. అలాంటి వారితో మళ్లీ కలిసి పనిచేసేందుకు సిద్ధమయ్యారు.

నేడు బీఆర్ఎస్‌లో చేరిక..

మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు అప్పాల గణేశ్‌చక్రవర్తి బుధవారం బీఆర్ఎస్‌లో చేరనున్నారు. జిల్లాకేంద్రంలోని దివ్యగార్డెన్స్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువా వేసుకోనున్నారు. ఆయనతోపాటు పదిమంది వరకు మాజీ కౌన్సిలర్లు, వివిధ పార్టీల్లో పనిచేస్తున్న నాయకులు బీఆర్ఎస్‌లో చేరనున్నారు. ముందుగా స్థానిక మార్కెట్‌కమిటీ నుంచి బైక్‌ర్యాలీగా బయలుదేరి, పట్టణంలో ప్రధాన వీధుల గుండా దివ్యగార్డెన్ చేరుకుంటారని, అక్కడ చేరికల కార్యక్రమం ఉంటుందని పార్టీ నాయకులు తెలిపారు.

హరితహారం లక్ష్యం పూర్తి చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి

భైంసాటౌన్: భైంసా పట్టణంలో హరితహారం లక్ష్యం త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సంబధిత అధికారులకు సూచించారు. మంగళవారం భైంసాలో ఆకస్మికంగా పర్యటించారు. భోకర్ రోడ్డులోని మున్సిపల్ నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఎన్ని ఉన్నాయని లెక్క పెట్టించారు. నర్సరీలో 60 వేల మొక్కలు కూడా లేవని, 2.40 లక్షల మొక్కల లక్ష్యం ఎలా చేరుకుంటారని ప్రశ్నించారు. నర్సరీ నిర్వహణ బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని, షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డీఈఈ నాగేశ్వర్‌రావుకు సూచించారు. అనంతరం అక్కడి నుంచి ఏరియా ఆసుపత్రికి చేరుకుని వార్డులన్నీ కలియ తిరిగారు. వైద్యసేవలు, వసతులపై సూపరింటెండెంట్ కాశీనాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. రోగులు కూర్చునేందుకు బెంచీలు, ఐపీ, ఓపీ విభాగాల్లో ఇన్వర్టర్లు, 40కేవీ జనరేటర్‌తోపాటు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని మున్సిపల్ డీఈఈకి సూచించారు. అలాగే ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటించాలన్నారు. అక్కడి నుంచి సమీకృత మార్కెట్‌కు వెళ్లి పనులు పరిశీలించారు. కుంట ప్రాంతంలోని అర్బన్ పీహెచ్‌సీని తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ధనరాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఇద్రిజ్ ఘోరి ఉన్నారు.

సమీకృత మార్కెట్ పనులపై అసంతృప్తి...

పట్టణంలోని సమీకృత మార్కెట్ నిర్మాణ పనులపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. పబ్లిక్ హెల్త్ విభాగం డీఈఈ సంతోష్, ఏఈ హరిభువన్‌గౌడ్‌పై అసహనం వ్యక్తం చేశారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో కనీస ప్రణాళిక లేకుండా ఎలా పనులు చేపడుతున్నారని ప్రశ్నించారు. ప్రధాన గేటుకు ఎదురుగా మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం చేపట్టడంపై నిలదీశారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌కు కలిగే ఇబ్బందులపై అవగాహన లేకుండా ఎలా నిర్మించారని ప్రశ్నించారు. భారీ, ఇతర లోడ్ వాహనాలు లోనికి ప్రవేశించడంతోపాటు బయటికి వెళ్లేలా దారి ఏర్పాటు చేసి ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు.



సమీకృత మార్కెట్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ముధోల్: పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. ముధోల్ మండలం విఠోలి తండా, రువ్వి, కారేగాం, ఎడ్‌బిడ్ గ్రామపంచాయతీలను మంగళవారం పరిశీలించారు. సందర్భంగా పల్లె ప్రకృతివనాన్ని పరిశీలించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. డ్రైడేకు సంబంధించిన పనులను పరిశీలించారు. వర్షాకాలం దృష్ట్యా ఎక్కడా నీటిని నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్‌పౌడర్ చల్లాలన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ భవనం, పాఠశాలను పరిశీలించారు. పలు విషయాలను ఎంపీడీవో సురేశ్‌బాబును అడిగి తెలుసుకున్నారు. రువ్వి గ్రామంలో పారిశుధ్య పనులు పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట సర్పంచ్ విజయ్‌రాథోడ్, కార్యదర్శి గంగన్న ఉన్నారు.

పాడి పరిశ్రమతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సరిత

లోకేశ్వరం:రైతులు పాడి పరిశ్రమపై దృష్టిసారించి ఆర్థికంగా ఎదగాలని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సరిత అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యలయంలో పాడి రైతులకు, గోపాల మిత్రలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసదర్భంగా స్త్రీనిధి రీజినల్ మేనేజర్ సరిత మాట్లాడుతూ పాడి రైతులు ఒక పాడి గేదెకు రూ.93,554 రుణం కింద అందజేస్తామన్నారు. స్త్రీనిధి కింద గతేడాది రూ.8 కోట్ల రుణాలు మహిళలు అందించామన్నారు. మండలంలో పాల దిగుబడి పెరిగితే మండల కేంద్రంలో చిన్న పాల శీతల కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా సంఘాల సభ్యులు చైతన్య వంతులను చేసి స్త్రీనిధి తోడ్పాటుతో చిన్న వ్యాపారాలు చేస్తూ కుటుంబాలకు ఆసరాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ మధుసూదన్ రావు, నిర్మల్ జిల్లా బీఎంసీ మేనేజర్ దస్రురు నాయక్, భైంసా బీఎంసీ మేనేజర్ గజ్జారాం, ఏపీఎం మల్లేశ్, మండల సూపర్‌వైజర్ దండే రమేశ్ ఉన్నారు.

జనాభా నియంత్రణకు సహకరించాలి

నిర్మల్‌చైన్‌గేట్:జనాభా నియంత్రణ, స్థిరీకరణకు అందరూ తమవంతు సహకారం అందించాలని, కృతనిశ్చయంతో పనిచేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాత్కాలిక కుటుంబ నియంత్రణ, శాశ్వత కుటుంబ నియంత్రణ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, శిశు సంక్షేమ శాఖ , స్వచ్ఛంద సేవా సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ కుటుంబ నియంత్రణ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని వివరించారు. అనంతరం జిల్లాలో ఉత్తమ సేవలందించిన వైద్యాధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ నాయనరెడ్డి, డాక్టర్ రాజారమేశ్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నిఖిల రాణి, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, డీపీహెచ్‌ఎన్‌వో సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఎంహెచ్‌వో

అందరికీ ఉపాధి

- జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్

కుంటాల: జిల్లాలో అవసరమైన అందరికీ ఉపాధి కల్పిస్తామని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కుంటాలలో స్త్రీ శక్తి భవనంలో ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారి క్రమబద్ధీకరణ, తెలంగాణరాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ లబ్ధిదారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం వివిధ రంగాల్లో రాయితీపై రుణాలు ఇస్తుందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఏపీడీ గోవింద్‌రావు, డీపీఎంలు సాయిప్రసాద్, జ్ఞాను, విజయలక్ష్మి, ఏపీఎం భోజన్న, ఏపీవో గట్టుపల్లి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

ఉపాధ్యాయుల కోసం ఆందోళన



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

దస్తురాబాద్: మండలంలోని మున్యాల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని పాండ్వాపూర్–కలమడుగు రహదారిపై విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం ఆందోళన చేశారు. పాఠశాలలో 96 మంది విద్యార్థులు ఉన్నారని, ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నాడని తెలిపారు. పాఠాలు చెప్పేవారు లేక విద్యార్థులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. పోలీసులు చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. అయినా ఆందోళన విరమించకపోవడంతో తహసీల్దార్ లక్ష్మి చేరుకుని ఆందోళనకారులను సముదాయించి డీఈవోతో ఫోన్‌లో మాట్లాడించారు. రెండు రోజుల్లో పరిష్కారిస్తామని డీఈవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి

నిర్మల్ రూరల్: విద్యార్థులు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రతీ పోటీల్లో పాల్గొనాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల పాఠశాలలో 9వ తరగతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోస్టర్ల తయారీ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ వివిధ రకాల పోటీల్లో పాల్గొంటే నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. విషయ పరిజ్ఞానం మెరుగు పడుతుందని పేర్కొన్నారు. ప్రతీ మండలం నుంచి ముగ్గురు విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా ముగ్గురిని విజేతలుగా ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. ఏఎంవో నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాఫర్ మోహినొద్దీన్, న్యాయనిర్ణేతలు రవీంద్ర, వనజ, మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులు గెలుచుకున్న విద్యార్థులు

విజేతలు:
మొదటి బహుమతి(రూ. 500): ఆయేషా సిద్ధిఖి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రియదర్శిని నగర్, నిర్మల్
రెండవ బహుమతి(రూ.300): నిఖత్ ఫాతిమా, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, సోమవార్‌పేట్, నిర్మల్
మూడవ బహుమతి(రూ. 200): వైష్ణవి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జుమ్మేరాత్‌పేట్, నిర్మల్

సాధారణ ప్రసవాలు పెంచాలి

నిర్మల్‌చైన్‌గేట్:జిల్లా ప్రసూతి ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. జిల్లా ప్రసూతి ఆస్పత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణుల కోసం ఏర్పాటుచేసిన వ్యాయామశాల, డైస్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడారు. గర్భిణులకు నార్మల్ డెలివరీలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు.



జిల్లా ప్రసూతి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

క్లుప్తంగా

రవీంద్రప్రసాద్‌కు ఉత్తమ డాక్టర్ అవార్డు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డాక్టర్

బోథ్: బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్ జిల్లాలో అత్యధికంగా 196 కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసినందుకు ఉత్తమ డాక్టర్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. కుటుంబ నియంత్రణ చికిత్సలకు బోథ్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆదర్శంగా నిలబడిందన్నారు. ఈ సందర్భంగా రవీంద్రప్రసాద్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

జాతీయస్థాయి వుషూ పోటీలకు ఎంపిక



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

భైంసాటౌన్: జాతీయస్థాయి వుషూ పోటీలకు జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఎన్ఐఎస్ కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 9, 10 తేదీల్లో అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన జూనియర్, సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 14 మంది క్రీడాకారులు పాల్గొనగా జూనియర్స్ (48 కేజీ) విభాగంలో ఆర్ సోనితాయి, (52కేజీ) విభాగంలో ఆర్.స్వాతి, బాలుర విభాగంలో (42 కేజీ) రామ్‌చరణ్, (52 కేజీ) విభాగంలో జె.కిరణ్ బంగారు పతకాలు సాధించారు. (39కేజీ) విభాగంలో కె. భావన, (52 కేజీ) విభాగంలో జి.కమల్ రజత పతకాలు పొందారు. (33 కేజీ) విభాగంలో సీహెచ్ శీతల్, (39కేజీ) విభాగంలో ఆర్.సింధు, (48 కేజీ) విభాగంలో సీహెచ్ స్పందన కాంస్య పతకాలు గెలుపొందారు. బంగారు పతకాలు పొందిన క్రీడాకారులు బీహార్‌లో ఆగస్టు 6 నుంచి 11వ తేదీ వరకు జరిగే 22వ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు నిర్మల్ జిల్లా అధ్యక్షులు నగేష్, చందుల స్వామి అభినందించారు.

2న చలో ఢిల్లీ

కైలాస్‌నగర్: దివ్యాంగులకు రాజకీయ పరమైన రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆగస్టు 2వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు కోరారు. మంగళవారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, ప్రహ్లాద్, సంతోష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

ఇచ్చోడ: రూ.2500 విలువ గల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు స్థానిక సుభాష్‌నగర్ కాలనీలో మంగళవారం ఆకస్మాత్తుగా దాడి చేసి గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పసిడి సాగు పతనం

- గిట్టుబాటు ధరలు లేక ఆసక్తి చూపని పసుపు రైతులు
- మార్కెట్ సౌకర్యం కరువు



పసుపు విత్తనం



పసుపు పంట సాగు (ఫైల్)

మామడ: పసుపు సాగును పసిడితో పోలుస్తారు. పసిడి ధరలు పెరిగితే పసుపు ధరలు పెరుగుతాయని రైతుల నమ్మకం. రైతులు పసుపు పంటతో సాగు చేసే మిగితా పంటలు వరి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటలు సాగు చేసి విక్రయించగా వచ్చిన ఆదాయం సాగుకు పెట్టిన పెట్టుబడులకు సరిపోగా పసుపు పంట విక్రయించగా వచ్చే ఆదాయంతో ఇక్కడి రైతులు ఇల్లు కట్టుకోవడం, పిల్లలకు పెళ్లిళ్లు చేయడం వంటి శుభకార్యాలకు వినియోగిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ సీఎంగా ఉన్న సమయంలో ఏడాది క్వింటాల్ పసుపు పదిహేను వేలు పలికింది. ఏళ్లుగా పసుపు పంటకు గిట్టుబాటు ధరలు ఉండకపోవడంతో రైతులు పసుపు పంట సాగును క్రమంగా తగ్గిస్తూ ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగుకు మొగ్గు చూపుతున్నారు.

పసుపు సాగుపై రైతుల విముఖత...

పసుపు పంటను తొమ్మిది నెలల పాటు చేయాల్సి ఉంటుంది. ఎకరంలో పసుపు పంటను సాగు చేసేందుకు లక్ష రూపాయలకు పైగా వ్యయం అవుతోంది. ఎకరంలో 20క్వింటాళ్ల వరకు పసుపు పంట రైతులకు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది పసుపు పంటకు క్వింటాల్‌కు 4 నుంచి 5వేల వరకు మాత్రమే ధర లభించింది. దీంతో పసుపు సాగుచేసిన రైతులకు ఎకరంన్నరకు రూ.80వేలు రావడంతో గిట్టుబాటు కాక నష్టం వాటిల్లింది.

నిర్మల్ జిల్లాలో పసుపు పంట సాగు వివరాలు

సంవత్సరం	పసుపు సాగు ఎకరాల్లో..
2020	16,043
2021	13,671
2022	11,797
2023	10వేల ఎకరాల అంచనా

మార్కెట్ లేదు.. గిట్టుబాటు రాదు..

జిల్లాలో లక్ష్మణచాంద, మామడ, సోన్, నిర్మల్ రూరల్, సారంగపూర్, ఖానాపూర్, దిలావార్‌పూర్, లోకేశ్వరం, కుంటాల, నర్సాపూర్(జి) మండలాలలో పసుపు పంటను రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో 4లక్షల 40వేల ఎకరాల్లో మొత్తం పంటలు సాగు చేస్తుండగా గత ఏడాది 11,797 ఎకరాల్లో 11,38 మంది రైతులు పసుపు పంటను సాగు చేశారు. పండించిన పసుపు పంటను విక్రయించేందుకు మార్కెట్ సౌకర్యం లేక నిజామాబాద్, మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌కు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. రైతులకు రవాణా చార్జీల రూపంలో వ్యయం ఎక్కువ. మార్కెట్ సౌకర్యం కల్పించాలని ఇక్కడి ప్రాంత రైతులు డిమాండ్ చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తారని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. కొందరు పూర్తిగా పసుపు పంట సాగును నిలిపి వేయకుండా ధరలు పెరుగుతాయన్న ఆశతో పసుపు పంట సాగును సగానికి తగ్గించారు. పసుపు పంట సాగుకు బదులుగా మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, ఆయిల్ పాం వంటి పంటలను సాగు చేస్తున్నారు.

మూడేళ్లుగా పంట సాగు తగ్గించాను



నేను ప్రతీ ఏడాది నాలుగు ఎకరాలలో పసుపు పంటను సాగు చేసేవాడిని. మూడు సంవత్సరాలుగా పసుపు పంటకు ధరలు లేక పోవడంతో పసుపు పంట సాగు వ్యయం పెరిగింది. గిట్టుబాటు ధరలు లేక లాభాలు రాకపోగా పసుపు పంట సాగు చేస్తే నష్టం వచ్చింది. పసుపు పంట సాగును నాలుగు ఎకరాల నుంచి ఎకరానికి తగ్గించాను. పసుపు పంటకు బదులుగా ఇతర పంటలను సాగు చేస్తున్నాను.

– మధుసూదన్‌రెడ్డి, సిద్దులకుంట, రైతు

పంటల సాగులో వ్యయాన్ని తగ్గించుకోవాలి



పంటల సాగులో రైతులు వ్యయం తగ్గించుకోవాలి. పంటల సాగులో పంటమార్పిని పాటించాలి. జిల్లాలో పసుపు, ఆయిల్‌పాం, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, వరి పంటలను సాగు చేస్తున్నారు. పసుపు పంటతో పోలిస్తే ఇతర పంటలు తక్కువ వ్యయంతోనే సాగు చేయవచ్చు. ఇతర పంటలకు ఆశించిన ధరలు ఉంటే మంచి లాభాలు పొందుతారు.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి



మొక్కలు నాటుతున్న ఐటీడీఏ పీవో



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఐటీడీఏ పీవో

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్
- జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాలలో రెండు గంటల పాటు పదో తరగతి విద్యార్థులకు బోధన

నార్నూర్: ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని, విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం మండలంలోని జామ్‌డా బాలికల ఆశ్రమ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. డివిజన్ లెవల్ ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో వందశాతం విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మీ పిల్లలపై ఎటువంటి శ్రద్ధ తీసుకుంటారో పాఠశాలలో చదివే విద్యార్థులపై అలాగే శ్రద్ధ తీసుకుని నాణ్యమైన విద్యతో పాటు మంచి భోజనాన్ని అందించాలన్నారు. జామ్‌డా పాఠశాల సమస్యలను ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలు ప్రశ్నలు అడిగారు. ఇద్దరు, ముగ్గురు విద్యార్థినులు సరిగా సమాధానం చెప్పకపోవడంతో బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలం విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వసతి గృహాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతికుమార్ ఉన్నారు.

ప్రతీ విద్యార్థికి ప్రవేశం కల్పించేలా చర్యలు

ఉట్నూర్‌రూరల్: గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ప్రతీ విద్యార్థికి ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఉట్నూర్ మండలం లాల్‌టేకిడి ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించిన కౌన్సెలింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రతీ గిరిజన విద్యార్థికి రెసిడెన్షియల్ కళాశాలలో ప్రవేశం కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు 212 మందికి ప్రవేశాలు కల్పించినట్లు తెలిపారు. కళాశాల నుంచి మరో కళాశాలకు కోరుకున్న విద్యార్థులకు బదిలీ చేసినట్లు చెప్పారు. అనంతరం హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఆర్సీఓ గంగాధర్, ఏసీఎంవో జగన్, ఏటీడీవో క్రాంతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



ముత్తవ్వ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని ధార్మిక్‌నగర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మహిళ మృతి చెందింది. నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన గొల్లసాయి ముత్తవ్వ తన భర్త గొల్లసాయి లక్ష్మణ్‌తో కలిసి శుభకార్యానికి ఆహ్వానించేందుకు వాంకిడిలోని బంధువుల ఇంటికి ఆదివారం ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా ధార్మిక్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోయారు. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముత్తవ్వ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనర్హులకు 'పోడు' పట్టాలు

- డ్యాంగాపూర్‌లో ముగ్గురికి..
- అటవీ అధికారులకు ఫిర్యాదు



డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: అడవినే నమ్ముకున్న ఆదివాసీలకు ఇవ్వాల్సిన పోడుపట్టాలు అనర్హులకూ అందుతున్నాయి. నిర్మల్‌రూరల్ మండలంలోని డ్యాంగాపూర్‌లో మొత్తం ఆరుగురికి పట్టాలు రాగా అందులో ముగ్గురు ఎస్టీలు కాదని తేలింది. ఈమేరకు తుడుందెబ్బ నాయకులు, గ్రామస్తులు మంగళవారం నిర్మల్‌లో అటవీశాఖ కార్యాలయంలో సదరు ఆధారాలతో డీఎఫ్‌ఓ సునీల్ హిరేమత్‌కు ఫిర్యాదు చేశారు.

ముగ్గురు ఇతరులే..

గ్రామంలో పోడు భూములకు సంబంధించి ఇటీవల వ్యక్తిగత అటవీహక్కుల పత్రాలను అందించారు. ఇందులో భాగంగా డ్యాంగాపూర్‌లో ఆరుగురు అర్హులంటూ ఎంపిక చేసిన అధికారులు గుర్తించారు. ఈ ఆరుగురిలో ముగ్గురే ఇందుకు అర్హులని, మిగితా ముగ్గురు ఎస్టీలు కాదని గ్రామస్తులకు తెలిసింది. ఇద్దరు బీసీ–డీ, ఒకరు ఎస్సీ వర్గానికి చెందిన వారికి పట్టాలు ఇచ్చినట్లు ఫిర్యాదుదారులు ఆధారాలు చూపారు. అర్హులైన ఎస్టీలు ఉండగా నిబంధనల ప్రకారం అర్హత లేనివారికి ఎలా ఇస్తారంటూ వారు ప్రశ్నించారు. దీనిపై డీఎఫ్‌ఓ స్పందిస్తూ.. కమిటీ, గ్రామ కార్యదర్శి క్షేత్రస్థాయిలో ఎంపికలు చేశారని, అనర్హులకు ఇవ్వడంపై తమ శాఖ పరంగా కూడా వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. పోడుపట్టాలు అనర్హులకు అందడంపై ఆర్డీవో విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

ప్రమాదానికి కారణమైన లారీ పట్టివేత

- వివరాలు వెల్లడించిన డీఎస్పీ నాగేందర్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేందర్

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి 44పై మేకలగండి వద్ద గత 8వ తేదీ తెల్లవారుజామున జరిగిన ఆటో ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ నాగేందర్ ఇచ్చోడ పోలీస్‌స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించాడు. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే లారీని డ్రైవర్ చాట్ల రజనీకాంత్ 8వ తేదీ ఉదయం 4గంటలకు అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ముందు వెళ్తున్న ఆటోను ఢీ కొట్టి వెళ్లిపోయాడు. లారీని చంద్రపూర్ తీసుకెళ్లి గ్యారేజీలో లారీ బంపరు, ఇతర భాగాలను కొత్తగా అమర్చాడు. ఎప్పటిలాగే విధులు నిర్వహిస్తున్నాడు. పోలీసులు మాత్రం ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకోవడానికి అన్ని విధాల ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలో రహదారిపై వివిధ చోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగా పట్టుకుని డ్రైవర్ రజనీకాంత్‌ను విచారించగా నేరాన్ని ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్, ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

పార్టీపై కుట్రలు చేస్తే సహించేది లేదు

- పార్టీకి నష్టం చేసేవారు పద్ధతి మార్చుకోవాలి
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భొజ్జు

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్ నియోజకవర్గంలో కొంత మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు తెర వెనుక కుట్రలు చేస్తూ పార్టీకి నష్టం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని విచ్ఛిన్నం చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్న స్థానిక నేతల తీరుపై ఆయన మండిపడ్డారు. నియోజకవర్గానికి చెందిన మాజీ ఎంపీటీసీ భరత్‌చౌహాన్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్‌లు గతంలో ఉన్న వారి పార్టీ పదవులకు రాజీనామా చేశారన్నారు. కార్యకర్తలను తప్పుదోవ పట్టించడానికి ఒకరు రాష్ట్ర ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షుడిగా, మరొకరు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా ప్రచారం చేసుకుంటూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. ఈ నెల నాలుగో తేదీన విడుదలైన మండల అధ్యక్షుల నియామకాల జాబితాలో కొన్ని పొరపాట్లు దొర్లాయని గుర్తించిన అధిష్టానం దాన్ని సవరిస్తూ ఐదో తేదీన తాజా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కొంత మంది నాయకులు గ్రూప్‌గా ఏర్పడి నియోజకవర్గంలో కార్యకర్తల మధ్య గందరగోళం సృష్టిస్తున్నారని తెలిపారు. భారత్‌చౌహాన్, చారులతపై అధిష్టానానికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ బిరుదుల లాజర్, మాజీ మండల అధ్యక్షుడు దూట రాజేశ్వర్, మాజీ సర్పంచ్‌లు, భీమన్న, మాణిక్‌రావు, మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ సలీం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అచ్చ దేవానందం, మైనార్టీ చౌస్ అధ్యక్షుడు ఇమ్రాన్, రాజగౌడ్, అహ్మద్, రాహుల్, పైకు, అబ్దుల్ మాజీద్, నగేశ్, సుధాకర్ ఉన్నారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



సచిన్ (ఫైల్)

జైనథ్: బేల మండలం చప్రాల గ్రామానికి చెందిన నకాతే సచిన్ (25) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. వారి కథనం ప్రకారం... సచిన్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో తాగుడు మానాలని తల్లిదండ్రులు పలుమార్లు హెచ్చరించినప్పటికీ మానుకోలేదు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం కుటుంబీకులు మందలించగా మనస్తాపానికి గురై ఇంటి నుంచి మ్యాక్స్ పికప్ వాహనంలో ఆదిలాబాద్ వైపు వెళ్లాడు. మార్గమధ్యలో జైనథ్ మండలం దీపాయిగూడ ఎక్స్‌రోడ్ సమీపంలో వాహనంలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. తండ్రి నకాతే వినాయక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సరిహద్దు ప్రాంతాలపై నిఘా పెంచాలి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

తాంసి: భీంపూర్ మండలం మహారాష్ట్ర సరిహద్దున ఉన్నందున అంతర్రాష్ట్ర రహదారిలో అక్రమ రవాణా జరుగకుండా నిఘా పెంచాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం భీంపూర్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్, సరిహద్దు గ్రామాలను ఎస్సై రాధికతో కలిసి తనిఖీ చేశారు. మొదట పోలీస్‌స్టేషన్ సందర్శించి స్టేషన్‌లో పరిసరాలను రికార్డులను పరిశీలించి ఎస్సైకి పలు సూచనలు చేశారు. సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై ఆరాతీశారు. అనంతరం మండలంలోని కరంజి అర్లి(టి) సరిహద్దు గ్రామాలను సందర్శించారు. పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. ప్రభుత్వం చదువు కోసం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్లి(టి) గ్రామంలోని విత్తన దుకాణాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే దొంగతనాలు అరికట్టే అవకాశం ఉన్నందునా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. వారి వెంట భీంపూర్ ఎస్సై రాధిక, సిబ్బంది ఉన్నారు.

కార్యాలయాలకు వెళ్లేదెలా..?



మున్సిపల్ కార్యాలయం ఎదుట గుంతలు



మున్సిపల్ కార్యాలయం ఎదుట..



మున్సిపల్ కార్యాలయం వద్ద బురద..



జెడ్పీ కార్యాలయ ఆవరణలో...

నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు కార్యాలయ ఆవరణలో చినుకుపడితే బురదమయంగా మారి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిర్మల్ మున్సిపల్ కార్యాలయం ఆవరణ బురదమయంగా మారడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్ కార్యాలయం ఇలా ఉంటే పట్టణం ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే జెడ్పీ కార్యాలయం చుట్టు పక్కల ఉన్న ఎంపీపీ, ఐకేపీ కార్యాలయాలకు వెళ్లాలంటే బురద దాటుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - సాక్షి, ఫొటోగ్రాఫర్ నిర్మల్